

ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

నేడు విక్రవాండి
ఉప ఎన్నిక పోలింగ్

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



అడయార్, జూలై 9: విల్లుపురం జిల్లా విక్రవాండి శాసన సభ నియోజకవర్గానికి బుధవారం ఉప ఎన్నిక పోలింగ్ జరుగనుంది. ఉదయం 7కి ఓటింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు వీలుగా నియోజకవర్గ వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ పోలింగ్ సందర్భంగా బుధవారం స్థానిక సెలవు ప్రకటించారు. దీంతో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పళని కోరారు. విక్రవాండి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న పుహళేంది ఆకస్మిక మృతితో ఈ స్థానానికి కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా సోమవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసింది. ఉప పోరులో మొత్తం 29 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే, డీఎండీకేలు పోటీకి దూరంగా ఉన్నాయి.

2.37 లక్షల మంది ఓటర్లు.. 276 పోలింగ్ కేంద్రాలు

ఈ ఉప ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం 2,37,031 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 1,16,962 మంది పురుషులు, 1,20,040 మంది మహిళలు, 29 మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారు. ఈ ఓటర్ల కోసం నియోజకవర్గంలో 276 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో నలుగురు పోలింగ్ సిబ్బంది ఉంటారు. ఇలా 276 పోలింగ్ బూత్‌ల కోసం 1355 మంది సిబ్బందిని ఎన్నికల విధుల కోసం నియమించారు. ఈవీఎంలను తరలించేందుకు, పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తీసుకెళ్ళేందుకు వీలుగా జీపీఎస్ సౌకర్యంతో కూడిన వాహనాలను సిద్ధం చేశారు.

తరలిన ఈవీఎంలు...

ఈ పోలింగ్ కోసం ఈవీఎంను గట్టి భద్రత మధ్య పోలింగ్ బూత్‌లకు ఎన్నికల అధికరారులు తరలించారు. ఈవీఎంలతో పాటు పోలింగ్ నిర్వహణకు అవసరమైన సామగ్రిని కూడా చేర్చారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభంకాగా ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తారు. అదేవిధంగా నియోజకవర్గంలో సమస్యాత్మక, అత్యం త సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 44 ఉన్నట్టు గుర్తించి, పారామిలిటరీ బలగాలతో భద్రత ఏర్పాటుచేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా నార్త్ రేంజ్ ఐజీ నరేంద్ర నాయర్ సారథ్యంలో 2500 మంది పోలీసులను భద్రత కోసం వినియోగించారు. స్థానిక పోలీసులతో పాటు పారామిలిటరీ, సాయుధ పోలీసులు ఎన్నికల బందోబస్తులో పాల్గొంటున్నారు.

నేడు స్థానిక సెలవు

పోలింగ్ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల సంఘం బుధవారం వేతనంతో కూడిన స్థానిక సెలవు (లోకల్ హాలిడే)ను ప్రకటించింది. ఈ నియోజకవర్గానికి చెంది ఇతర జిల్లాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు కూడా సెలవు ఇచ్చారు. ఒక్క విక్రవాండి నియోజకవర్గ పరిధి మినహా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, కాలేజీలు, బ్యాంకులు, ప్రైవేటు కంపెనీలు యధావిధిగా పనిచేస్తామని కలెక్టర్ పళని ప్రకటించారు.

ఇక రౌడీలకు కష్టకాలమే

- శాంతిభద్రతలపై సీఎం సీరియస్
- పోలీస్ బాస్‌లతో సమీక్ష



సీఎంతో చర్చిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ నేతలను టార్గెట్ చేసుకుని హత్యలు, దాడులకు పాల్పడుతున్న అల్లరి మూకలను అణగదొక్కేయాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పోలీసుశాఖను ఆదేశించారు. ముఖ్యంగా హత్యలు, దారిదోపిడీలు, మానభంగాలకు పాల్పడుతున్న కిరాయి ముఠాలు, రౌడీల భరతం పట్టాలని కూడా తేల్చిచెప్పారు. ఈ వ్యవహారంలో పోలీస్‌శాఖకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు కూడా ఆయన స్పష్టం చేశారు. నగరంలో బీఎస్పీ నేత ఆర్మ్ స్ట్రాంగ్ హత్యకు గురైన నేపథ్యంలో రాష్ట్రంలో శాంతి భద్రతలను పటిష్ఠం చేయడంలో భాగంగా సచివాలయంలో మంగళవారం పోలీసు ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, హోంశాఖ కార్యదర్శి పి.అముద, డీజీపీ శంకర్ జివాల్, గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్, శాంతిభద్రతల విభాగం అడిషనల్ డీజీపీ డేవిడ్‌సన్ దేవాశీర్వాదం, ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శులు పాల్గొన్నారు. రాష్ట్రంలో హత్యలు, దోపిడీలు అధికమవుతున్నాయని, మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా రవాణా అవుతున్నాయని ప్రధాన ప్రతిపక్షాలన్నీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని, ఇకపై వారి నుండి ఎలాంటి విమర్శలు రాని విధంగా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని కట్ట పంచాయతీ, దారిదోపిడీలు, హత్యలు, మానభంగాలకు పాల్పడే రౌడీల భరతం పట్టాలని ఆదేశించారు.

రౌడీల చిట్టా రెడీ...

రాష్ట్రంలో శాంతి భద్రతలను మరింత పటిష్ఠం చేయడంలో భాగంగా రౌడీల జాబితా సిద్ధం చేసే పనుల్లో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తలమునకలవుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర మంతటా 21వేల మందికిపైగా కిరాయి ముఠా సభ్యులు, రౌడీలు సంచరిస్తున్నట్లు రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు నివేదిక సమర్పించారు. ఆ జాబితాలోని రౌడీలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఆయా జిల్లాల పోలీసు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆ రౌడీల కదలికలపై డేగకళ్లతో తీవ్ర నిఘా వేస్తున్నారు. అన్ని పోలీసుస్టేషన్ల రికార్డుల్లో ఉన్న రౌడీషీటర్ల జాబితా అందజేయాలని ఇప్పటికే రాష్ట్ర శాంతి భద్రతల విభాగం ఏడీజీపీ డేవిడ్‌సన్ దేవాశీర్వాదం ఆదేశించారు.

నగరంలో 6 వేలమంది రౌడీలు...

నగరంలో పోలీసు రికార్డుల్లో సమాచారం మేరకు ఆరువేలమందికి పైగా రౌడీలున్నారు. వీరంతా దారిదోపిడీలు, హత్యలు, మానభంగాలు తదితర నేరాలకు పాల్పడి, ఒక్కొక్కరూ పదికి తక్కువ కాకుండా కేసులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వీరందరినీ అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టేందుకు పోలీసు ఉన్నతాధికారులు చర్యలు ప్రారంభించారు. నగరంలో రౌడీలకు సంబంధించిన వివరాలను నగరవాసు లు నిర్భయంగా తెలిపేందుకు గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరేట్ ఇప్పటికే ఈగిల్ యాప్ (పరుందు యాప్) కూడా అందుబాటులోకి తెచ్చింది. నగరంలోని సెంట్రల్ క్రైం విభాగంలోనూ రౌడీల ఏరివేతకు ప్రత్యేక విభాగం కూడా పనిచేస్తోంది. ఇక రౌడీలతో కందువడ్డీ వ్యాపారులతో సత్సంబంధాలున్న ఎస్ఐ, సీఐ, ఎస్పీ తదితర పోలీసు ఉన్నతాధికారులపై కఠిన చర్య లు తీసుకునేందుకు కూడా ప్రభుత్వం సిద్ధమైంది. ఆ దిశగా ప్రస్తుతం నేరస్థులకు వంతపాడే సిబ్బందిపై బదిలీ వేటు పడనుంది. అదే విధంగా మూడేళ్లకు పైగా ఒకే చోట పని చేస్తున్న ఎస్ఐలు, సీఐలను కూడా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని కూడా ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

ఇక రౌడీల సంచారానికి నో ఛాన్స్...

రాష్ట్రంలో ఇకపై రౌడీలు, కిరాయిముఠాలు నిర్భయంగా సంచరించే అవకాశాలే లేవని శాంతి భద్రతల విభాగం ఏడీజీపీ డేవిడ్‌సన్ దేవాశీర్వాదం ప్రకటించారు. వీలైనంత త్వరగా రౌడీలపై కఠిన చర్యలు చేపట్టి, వారంతా మళ్ళీ నేరాలపై కన్నెత్తి చూడని విధంగా శిక్షించనున్నామని ఆయన హెచ్చరించారు. దుకాణాల వద్ద మామూళ్ల వసూలుకు వెళ్లే రౌడీలు, దారి దోపిడీలకు పాల్పడే రౌడీలు, హత్యలు చేసే రౌడీలకు ఇక కష్టకాలమేనని ఆయన చెప్పారు. దాదాగిరికి పాల్పడే రౌడీలపై కూడా కఠిన చర్యలు చేపడతామన్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చి నేరాలకు పాల్పడే రౌడీలు ప్రాణభయంతో వారి స్వంత రాష్ట్రాలకు పరుగులు తీసే రీతిలో పోలీసులు చర్యలు ప్రారంభమవుతాయని కూడా ఆయన వివరించారు.


తెలుగు విద్యార్థులకు
అండగా ఉంటాం

- ఆస్కా అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారెడ్డి



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సుబ్బారెడ్డి, శ్రీనివాస రెడ్డి తదితరులు

ప్యారీస్, జూలై 9: తెలుగు మీడియం విద్యార్థులకు అండగా ఉంటామని ఆంధ్ర సోషల్ అండ్ కల్చరల్ క్లబ్ (ఆస్కా) అధ్యక్షుడు డాక్టర్ కె.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. విల్లివాక్కంలోని కనక దుర్గ తెలుగు మహోన్నత పాఠశాల (ఎస్కేడీటీ)లో చదువుతున్న 500 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఆస్కా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నోటుపుస్తకాలు, స్కాలర్ షిప్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సీఎం కిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుబ్బారెడ్డి, ఆస్కా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీనివాసుల రెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి ఆదినారాయణ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు అజంతా డా.కనిగెలుపుల శంకరరావు, జానకీరామ్, శ్రీనాథ్ పాల్గొని విద్యార్థులకు సహాయాలు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ... ఎస్కేడీటీ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులను చూస్తుంటే తన బాల్యం గుర్తుకొస్తుందని తెలిపారు. మెరిట్ విద్యార్థుల ఉన్నత చదువులకు ఆస్కా ట్రస్ట్ తరపున సాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తెలుగు భాష మధురమైనదని, మన మాతృభాషలో చదువుకున్న వారు కూడా ప్రపంచవ్యాప్తంగా ఉన్నత పదవుల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు. ఈ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామని, కంప్యూటర్లతో పాటు ఇంకా ఏమైనా సదుపాయాలు కావాలంటే తప్పకుండా అందిస్తామని సుబ్బారెడ్డి హామీనిచ్చారు. అనంతరం శ్రీనివాసుల రెడ్డి, అజంతా శంకరరావు, సీఎం కిషోర్ మాట్లాడుతూ... క్రమశిక్షణతో చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు కేఎస్ సారా సుహాసిని స్వాగతం పలుకగా, అసిస్టెంట్ హెచ్ఎం మోహన్ నాయుడు వందన సమర్పణ చేశారు. కార్యదర్శి పి.శ్రీనివాసరావు సహా పాఠశాల కార్యవర్గ సభ్యులు 14 సంవత్సరాలుగా తమ పాఠశాల విద్యార్థులకు ఉదార స్వభావంతో సహాయ సహకారాలు అందిస్తున్న ఆస్కా ట్రస్ట్ యజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపి, ఘనంగా సన్మానించారు.



చిదంబరం నటరాజస్వామి ఆలయం

చిదంబరంలో కనకసభ నుంచి
దర్శనాలకు అభ్యంతరాల్లేవ్

- హైకోర్టు ధర్మాసనం

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చిదంబరం నటరాజ స్వామివారి ఆలయంలో భక్తులు కనకసభపై నిలబడి దర్శించడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఆలయ నిర్వాహకులు అడ్డుచెప్పకూడదని కూడా హెచ్చరించింది. చిదంబరం నటరాజస్వామి ఆలయంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఆణి తిరుమంజన ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవా ల్లో భక్తులు కనకసభపై నుంచి నిలిచి స్వామివారిని దర్శించుకునేందుకు అనుమతించాలని కోరుతూ సంబంధమూర్తి రామనాథన్ అనే భక్తుడు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి ఆర్.మహదేవన్, న్యాయమూర్తి మహమ్మద్ సబీక్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. కనకసభపై నిలిచి భక్తులు దర్శనం చేయడానికి అనువుగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ హైకోర్టులో కేసు దాఖలై ఉందని, అయితే ఆ కేసులో ప్రభుత్వ ఉత్తర్వులపై ఎలాంటి స్టే విధించలేదని దేవాదాయ శాఖ తరపు న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. ఆ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు ధర్మాసనం కనకసభపై నిలిచి భక్తులు స్వామివారిని దర్శించే విషయమై ఎలాంటి స్టే ఉత్తర్వులు జారీ కాకపోవడంతో ఆణి తిరుమంజనం ఉత్సవాల్లో భక్తులు కనకసభపై నిలిచి దర్శనం చేసుకునేందుకు ఎలాంటి అభ్యంతరాలు లేవని పేర్కొంది. భక్తులు కనకసభపై నిలిచి దర్శనం చేసుకునేందుకు ఆలయ నిర్వాహకులు ఎవరూ అడ్డు చెప్పకూడదని కూడా ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఆలయ నిర్వాహకులు భక్తులకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు వారిపై కఠిన చర్యలు చేపట్టవచ్చని కూడా ధర్మాసనం స్పష్టం చేసింది.

18 మంది ఐపీఎస్‌ల బదిలీ

- తాంబరం కమిషనర్‌గా అబిన్ దినేష్ మోదక్

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 18 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఆ మేరకు తాంబరం పోలీసు కమిషనర్‌గా అబిన్ దినేష్ మోదక్ నియమితులయ్యారు. తాంబరం పోలీసు కమిషనర్‌గా పని చేసిన డాక్టర్ ఎ.అమల్ రాజ్‌ను చెన్నై సీఐడీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు బదిలీ చేసింది. స్టేట్ క్రైం రికార్డ్స్ బ్యూరో డీజీపీ అబిన్ దినేష్ మోదక్‌ను తాంబరం పోలీసు కమిషనర్‌గా, చెన్నై సాయుధదళం ఏడీజీపీ హెచ్ఎం జయరామ్ స్టేట్ క్రైం రికార్డ్స్ బ్యూరోకు బదిలీ అయ్యారు. వేకన్సీ రిజర్వులో ఉన్న మహేష్‌కుమార్ అగర్వాల్ చెన్నై సాయుధ దళం ఏడీజీపీగా, చెన్నై క్రైం బ్రాంచ్ సీఐడీ ఏడీజీపీ జి.వెంకటరామన్ హెచ్ఓపీఎఫ్ అడ్మినిస్ట్రేషన్ ఏడీజీపీగా., అడ్మినిస్ట్రేషన్ ఏడీజీపీ వినిత్ దేవ్ వాఖండే పోలీసు హెడ్‌క్వార్టర్స్ ఏడీజీపీగా బదిలీ అయ్యారు. చెన్నై క్రైంబ్రాంచ్ సీఐడీలో పనిచేస్తున్న ఐజీ టీఎస్ అన్బును ఆ విభాగానికి పూర్తి స్థాయి ఏడీజీపీగా నియమితులయ్యారు. చెన్నై సైబర్ క్రైం ఏడీజీపీని సముద్రతీర భద్రతాదళం ఏడీజీపీగా బదిలీ చేశారు.. సముద్రతీర భద్రతాదళం ఏడీజీపీగా ఉన్న డాక్టర్ సందీప్ మిట్టల్‌ను చెన్నై సైబర్ క్రైం ఏడీజీపీగా బదిలీ చేశారు. వేకన్సీ రిజర్వులో ఉన్న రాజీవ్‌కుమార్ చెన్నైలోని మహిళలు, చిన్నారుల నేర నిరోధక విభాగం ఏడీజీపీగా, అక్కడ ఉన్న ఆర్.తమిల్ చంద్రన్ పోలీసు టెక్నికల్ సర్వీసెస్ ఏడీజీపీగా బదిలీ చేశారు. గ్రేటర్ చెన్నై సౌత్ శాంతి భద్రతల విభాగం ఐజీ ప్రేమ్ ఆనంద్ సిన్హా మదురై సౌత్ జోన్ ఐజీగా, ఆ పోస్టులో ఉన్న డాక్టర్ ఎన్ కన్నన్ గ్రేటర్ చెన్నై సౌత్ శాంతి భద్రతల విభాగం ఐజీగా నియమితులయ్యారు. చెన్నై నార్త్ శాంతి భద్రతల విభాగం ఐజీ అస్రాగార్గ్ చెన్నై నార్త్ జోన్ ఐజీగా, ప్రస్తుతం నార్త్‌జోన్ ఐజీగా ఉన్న కేఎస్ నరేంద్రన్ నాయర్ చెన్నై నార్త్ శాంతి భద్రతల విభాగం ఐజీగా బదిలీ అయ్యారు. తిరుప్పూరు నపోలీసుకమిషనర్ ప్రవీణ్‌కుమార్, సేలం నగర పోలీసు కమిషనర్‌గా ప్రస్తుత కమిషనర్ బి.విజయకుమారిని చెన్నై సాయుధ దళం ఐజీగా బదిలీ చేశారు. చెన్నై సాయుధ దళం ఐజీ ఎస్ లక్ష్మి తిరుప్పూరు నగర పోలీసు కమిషనర్గఆ బదిలీ అయ్యారు.

55 యేళ్ల తర్వాత నందనంలో కో-ఎడ్యుకేషన్

- కౌన్సెలింగ్‌లో 130 మంది విద్యార్థినులకు అడ్మిషన్లు



నందనం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థినులు

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో అత్యంత ప్రాచీనమైన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలగా పేరొందిన నందనం ఆర్ట్స్ కళాశాల 55 యేళ్ల తర్వాత కో -ఎడ్యుకేషన్ కాలేజీగా మారింది. ఆ కళాశాలలో తొలిసారిగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. వీరిలో 130 మంది అడ్మిషన్లు పొందారు. నందనం ఆర్ట్స్ కళాశాలను 1969లో ప్రారంభించారు. ఆంగ్లేయుల పాలనలో అన్నాసాలైలో 1901లో మదరాస్ పాఠశాల నెలకొల్పారు. 1918లో ఖాయిథేమిల్లత్ కళాశాలను ఆ పాఠశాల ప్రాంగణంలోనే ఏర్పాటు చేశారు. 1969లో ఆర్కాటు నవాబు బాలికల కళాశాలను ప్రారంభించారు. ఆ సమయంలోనే బాలుర కోసం పత్యేకంగా నందనం ఆర్ట్స్ కళాశాల ఏర్పాటు చేశారు. ఈ కళాశాల పూర్వ విద్యార్థుల్లో చాలా మంది రాజకీయ నేతలుగా, సంఘసేవకులుగా, పారిశ్రామికవేత్తలుగా ఉన్నత స్థితికి చేరుకున్నారు. ఇంతటి కీర్తి ప్రతిష్ఠలను సంతరించుకున్న ఈ కళాశాలలో గత కొంత కాలంగా విద్యార్థుల్లో దుష్ప్రవర్తన అధికమైంది. పోలీసులు, ఆ కళాశాల యాజమాన్యం సంయుక్తంగా రంగంలోకి దిగి విద్యార్థులపై కఠినచర్యలు చేపట్టి కళాశాలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పారు. ఈ పరిస్థితులలో ఆ కళాశాలను ఈ యేడాది నుండి కో-ఎడ్యుకేషన్‌గా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ప్రభుత్వ అనుమతితో ఆ కళాశాలలో విద్యార్థినులకు అడ్మిషన్లు కల్పించేందుకు దరఖాస్తుల స్వీకరణ జరిగింది. సోమవారం మధ్యాహ్నం ఆ కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు సుమారు 200 మంది విద్యార్థినులు హాజరు కాగా, 130 మందికి అడ్మిషన్లు ఇచ్చారు. ఆ మేరకు ఆ కళాశాలలో బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థినులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి వెంకటేశన్ మాట్లాడుతూ కళాశాలలో వివిధ కోర్సులకు సంబంధించి 1192 సీట్లున్నాయని, అదనంగా 20 శాతం సీట్లు పెంచేందుకు ప్రభుత్వం అనుమతివ్వడంతో ప్రస్తుతం 1480 సీట్లకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. కుంద్రత్తూరు, నెమిలి, పెరుంబాక్కం పరిసర ప్రాంతాల విద్యార్థినులు అడ్మిషన్ల కోసం వస్తున్నారని తెలిపారు. నందనం సమీపంలో నివసిస్తున్న విద్యార్థినులంతా ఇప్పటి వరకు క్వీన్‌మేరీస్, ఖాయిదేమిల్లథ్ కళాశాలల్లో చేరేవారని, ప్రస్తుతం తమ కళాశాలలో చేరేందుకు ఆసక్తికనబరుస్తున్నారని చెప్పారు.

సమాచార ధ్వని

ఆధునిక యంత్రాల నిర్వహణపై శిక్షణ

ఐసిఎఫ్, జూలై 9: మురుగునీరు తొలగింపు పనులు చేపట్టేందుకు ఆధునిక యంత్రాలు ఎలా నిర్వహించాలన్న దానిపై పారిశుధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెన్నై మెట్రోవాటర్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ వినయ్ తెలిపారు. మెట్రోవాటర్ బోర్డు నగరంలోని భూగర్భ డ్రైనేజీలో పూడికతీత, మురుగునీరు తొలగింపునకు యంత్రాలు వినియోగిస్తోంది. ఇటీవల కొత్తగా కొనుగోలు చేసిన ఆధునిక యంత్రాలతో పనిచేయడంపై వారికి శిక్షణ ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 9: స్థానిక గిండి ప్రభుత్వ వృత్తి శిక్షణ కేంద్రంలో కూల్ డ్రింక్స్, ఆహార పదార్థాల తయారీ విభాగంలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ తెలిపారు. చెన్నై జిల్లా ఎంప్లాయ్‌మెంట్, శిక్షణా శాఖ ఆధ్వర్యంలోని ఈ ఐటీఐలో 2024-25 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఏడాది శిక్షణా కాలానికి టెన్త్ ఉత్తీర్ణులైన వారు రూ.185 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణ పూర్తయిన వారికి కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ అందజేసి, ఫైవ్ స్టార్ హోటళ్లలో ఉద్యోగావకాశం కల్పిస్తారు. శిక్షణా సమయంలో నెలకు రూ.750 ఉపకార వేతనంతో పాటు యూనిఫాం, సైకిల్, షూ, బస్ పాస్, ట్రైన్ సీజన్ టిక్కెట్ అందజేస్తారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత బస, భోజనం అందజేస్తారు. ఆసక్తి ఉన్న వారు 9551422064, 8838214399 నెంబర్లు సంప్రదించవచ్చు.

ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ విభాగాల్లో అడ్మిషన్లు

ఐసిఎఫ్, జూలై 9: స్థానిక గిండి మహిళల ఐటీఐలో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఖాళీ సీట్లకు ఈ నెల 15వ తేది వరకు దరఖాస్తు స్వీకరణ జరుగనుంది. ఆర్కిటెక్చర్, ఐటీ, కంప్యూటర్ సర్వీస్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానికల్, కంప్యూటర్ అసిస్టెంట్ ఎంబ్రాయిడరీ, డిజైనర్, ఫ్యాషన్ డిజైనర్, టైలరింగ్, స్టెనోగ్రఫీ వంటి విభాగాల్లో చేరేందుకు 8, 10 ఉత్తీర్ణత కలిగిన ఆసక్తి ఉన్న మహిళలు 044-22510001, 9499055651 అనే నెంబర్లు సంప్రదించవచ్చు. శిక్షణ పొందే వారికి ఉపకారవేతనం, ఉచిత యూనిఫాం వంటివి అందజేస్తారు.

మెట్టూరు డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, జూలై 9: సేలం జిల్లాలోని మేట్టూరు డ్యాంలో నీటి పరిణామం పెరిగింది. కర్ణాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా ఆ రాష్ట్రంలోని కృష్ణరాజసాగర్, కబిని డ్యాంలకు భారీగా నీరు చేరుతుండడంతో, వాటి నుంచి 5,000 ఘనపుటడుగుల నీటిని కావేరి నదిలోకి విడుదల చేస్తున్నారు. ఆ జలాలు రాష్ట్ర సరిహద్దు పిల్లిగుండు, హొగెనేకల్ మీదుగా మేట్టూరు డ్యాంలో చేరుతున్నాయి. మంగళవారం గణాంకాల ప్రకారం మేట్టూరు డ్యాంలో నీటిమట్టం 3,342 ఘనపుటడుగులుకు పెరిగింది. ప్రస్తుతం డ్యాంలో 40.22 అడుగులు (పూర్తి సామర్థ్యం 120 అడుగులు) నీటి నిల్వలుండగా, తాగునీటి అవసరాలకు డ్యాం నుంచి 1,000 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సీజన్ టిక్కెట్టు కావాలంటే మొబైల్ నెంబరు తప్పనిసరి

ఐసిఎఫ్, జూలై 9: రైల్వే సీజన్ టిక్కెట్ కావాలంటే మొబైల్ నెంబర్లు తప్పనిసరిగా అందజేయాలని రైల్వే శాఖ ఉత్తర్వులు జారీచేసింది. చెన్నై సెంట్రల్, బీచ్ నుంచి శివారు ప్రాంతాలకు ప్రతిరోజు 550 సబర్బన్ రైలు సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ రైళ్లలో ప్రతిరోజు 8 లక్షల మందికి పైగా ప్రయాణిస్తున్నారు. చెన్నై రైల్వే డివిజన్‌లో 160 కి.మీ వరకు సీజన్ టిక్కెట్లు అందజేస్తున్నారు. సుమారు 7 లక్షల మంది ప్రయాణికులు సీజన్ టిక్కెట్లు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో, సీజన్ టిక్కెట్లు పొందడానికి, కౌంటర్లలో రెన్యువల్ చేయడానికి వచ్చే అన్ రిజర్వ్‌డ్ ప్రయాణికుల వద్ద మొబైల్ నెంబర్లు సేకరించాలని ఉద్యోగులకు రైల్వే శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

మెరీనా ఈత కొలను మూసివేత

ఐసిఎఫ్, జూలై 9: స్థానిక మెరీనా తీరంలో ఉన్న ఈత కొలనును కార్పొరేషన్ అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. మెరీనా తీరంలో ఉదయం, సాయంత్రం వేళల్లో 500 మందికి పైగా వాకింగ్, వ్యాయామం వంటివి చేస్తున్నారు. మరికొందరు స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్నారు. ఈ స్విమ్మింగ్ పూల్ పర్యవేక్షణ ఒప్పందం జూన్‌తో ముగిసింది. కొత్త ఒప్పందాలు ఖరారు కాకపోవడంతో తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

9.39 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు

ఐసిఎఫ్, జూలై 9: మొక్కజొన్న సాగు 9.39 లక్షల ఎకరాల్లో చేసేందుకు వ్యవసాయ శాఖ లక్ష్యాన్ని నిర్దేశించి పనులు ప్రారంభించింది. తమిళనాడు మాత్రమే కాకుండా వివిధ రాష్ట్రాల్లో మొక్కజొన్న వినియోగం పెరుగుతోంది. వరి, చెరకు తదితర పంటలకన్నా తక్కువ నీటితో జరిగే జొన్న సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఈ ఏడాది 18 జిల్లాల్లో మొక్కజొన్న సాగు పెంచేందుకు రూ.30 కోట్లతో పథకం రూపొందించారు. విత్తనాలు, ద్రవ రూప ఎరువులు, సహజ ఎరువులు, నానో యూరియా వంటివి 50,000 మంది రైతులకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు.

రేపు ఆణి తిరుమంజన రథోత్సవం

ఐసిఎఫ్, జూలై 9: చిదంబరం నటరాజ ఆలయ ఆణి తిరుమంజన రథోత్సవం గురువారం జరుగనుంది. చిదంబరంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శివకామసుందరి సమేత నటరాజ స్వామి ఆలయంలో ప్రతి ఏటా మార్గళి మాసంలో ఆరుద్ర దర్శనం, ఆణి మాసంలో ఆణి తిరుమంజనం ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఆణి తిరుమంజనం ఉత్సవాలు ఈ నెల 3వ తేది ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు, ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ వాహనాల్లో పంచమూర్తుల ఊరేగింపు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధానాంశమైన రథోత్సవం గురువారం, శుక్రవారం ఆణి తిరుమంజన మహా దర్శనం జరుగనున్నాయి.

ఎర్రచందనం పథకానికి రూ.1.90 కోట్లు

ఐసిఎఫ్, జూలై 9: రైతుల ద్వారా ఎర్రచందనం పెంచే పథకం కోసం రాష్ట్రప్రభుత్వం రూ.1.90 కోట్లు కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచేందుకు హరిత ఉద్యమం ద్వారా మినీ అడవులు ఏర్పాటుచేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో చందనం, ఎర్రచందనం చెట్లను అటవీ శాఖ పెంచుతోంది. రైతుల జీవనాధార అభివృద్ధి కోసం ఎర్రచందనం పెంపకం పథకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తిరుచ్చి, ధర్మపురి, సేలం, విల్లుపురం, తిరువళ్లూర్, తిరువణ్ణామలై, వేలూరు జిల్లాల్లో ఈ మొక్కల పెంపకం పథకానికి 1.25 లక్షల ఎర్రచందనం మొక్కలను ప్రభుత్వం అందజేసింది. ఇందుకోసం రూ.1.90 కోట్లు కేటాయించింది.

రాత్రి వేళల్లో ఇళ్లపై రాళ్లు

● ఆందోళనలో ఒట్టపాళయం గ్రామస్తులు





ఇళ్ల బయటే ఉంటున్న గ్రామస్తులు - ఎత్తైన క్రేన్లతో గస్తీ పనుల్లో పోలీసులు

పెరంబూర్, జూలై 9: తిరుప్పూర్ సమీపంలో ఇళ్లపై పడుతున్న రాళ్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గ్రామంలో విద్యుద్దీపాలు, డ్రోన్ కెమెరాలు, క్రేన్లు తదితరాలతో గ్రామస్తుల సాయం తో ఈ మిస్టరీ ఛేదించేందుకు పోలీసులు శ్రమిస్తున్నారు. తిరుప్పూర్ జిల్లా కాంగేయం సమీపం ఒట్టపాళయం గ్రామంలో 12 రోజులుగా రాత్రి వేళల్లో ఇళ్లపై రాళ్లు పడుతున్నాయి. రాళ్లు పడడంతో పలు ఇంటిపై ఉన్న రేకులు ధ్వంసమవుతున్నాయి. ఒకటి, రెండు రోజులు ఎవరో ఆకతాయిలు ఈ పని చేస్తున్నారని గ్రామస్తులు భావించగా, రాళ్లు పడడం కొనసాగుడడంతో వారు భయభ్రాంతులు చెందుతున్నారు. గ్రామంలోని యువకులు బృందంగా ఏర్పడి రాత్రి వేళ గ్రామం, పరిసరాల్లో గస్తీ తిరిగినా రాళ్లు పడడం ఆగడం లేదు. సమాచారం అందుకున్న పోలీసులు, గ్రామమంతా విద్యుద్దీపాలు, డ్రోన్ కెమెరాలు, క్రేన్లు ఏర్పాటుచేసి నిఘా ఏర్పాటుచేశారు. రాత్రి వేళల్లో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. కాంగేయం తహసీల్దార్ మయిల్‌స్వామి స్వయంగా గ్రామాన్ని పరిశీలించారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, రాళ్లు వేస్తున్న అగంతకులను త్వరలోనే పట్టుకుంటామని తహసీల్దార్ గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. అయినా అధికారులు, పోలీసుల మాటలు నమ్మని గ్రామస్తులు, రాత్రి వేళ ఇంటికి తాళాలు వేసి కరుప్పరాయన్ ఆలయంలో తలదాచుకుంటున్నారు.

బాణసంచా కర్మాగారంలో పేలుడు

● ఇద్దరు కార్మికుల దుర్మరణం





ముత్తుమురుగన్, మారియప్పన్ (ఫైల్‌ఫొటోలు)



పేలుడు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసు ఉన్నతాధికారి

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా శివకాశి సమీపం కాళయార్‌కురిచ్చి గ్రామంలోని ప్రైవేటు బాణసంచా కర్మాగారంలో సంభవించిన పేలుడులో ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు. ఆ గ్రామంలో మురుగవేల్ అనే వ్యక్తి 'సుప్రీం క్రాకర్స్' పేరుతో బాణసంచా తయారీ కర్మాగారాన్ని నడుపుతున్నారు. కాళయార్‌కురిచ్చి, చిదంబరాపురం తదితర ప్రాంతాలకు చెందిన సుమారు వంద మంది కార్మికులు ఆ కర్మాగారంలో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం కార్మికులు యధావిధిగా విధులకు హాజరయ్యారు. వారిలో పది మంది కార్మికులు ఆ కర్మాగారం గోదాములోని ఓ గదిలో టపాకాయల తయారీకి అవసరమైన రసాయనాలు కలుపుతుండగా ఉన్నట్టుండి పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి గోదాములోని గది నేలమట్టమైంది. తారా జువ్వల స్టాక్ కు కూడా నిప్పు అంటుకోవడంతో ఆ బాణసంచా సైతం కాలి బూడిదైంది. ఈ దుర్ఘటనలో చిదంబరాపురానికి చెందిన మారియప్పన్ (45), ముత్తుమురుగన్ (45) అనే కార్మికులు తీవ్రం గా గాయపడి ఘటనా స్థలంలోనే మరణించగా, సరోజా (55), శంకరవేల్ (54) అనే ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే మిగతా గదుల్లో ఉన్న కార్మికులంతా ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందుకున్న ఎం.పుదుపట్టి పోలీసులు, అగ్నిమాపక దళం హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. శిథిలాల మధ్యలో ఉన్న ఇద్దరు కార్మికుల మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. గాయపడిన ఇద్దరిని కూడా చికిత్స కోసం ఆసుపత్రికి తరలించి ఎం. పుదుపట్టి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కోయంబేడు నుంచి ఆమ్నీ బస్సులు నడిపేందుకు హైకోర్టు ధర్మాసనం నిరాకరణ

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కోయంబేడు నుంచి మళ్లీ ఆమ్నీ బస్సులు నడిపేందుకు కుదరదంటూ మద్రాసు హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. కొద్ది నెలల క్రితం కిలాంబాక్కంలో కొత్త బస్ టెర్మినల్ ప్రారంభించడంతో ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులతోపాటు ప్రైవేటు ఆమ్నీ బస్సులు కూడా ఆ ప్రాంతం నుండే నడపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై సింగిల్ జడ్జి విచారణ జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో కిలాంబాక్కం బస్‌టెర్మినల్ వద్ద మెట్రోరైలు విస్తరణ పనులు పూర్తయ్యేంతవరకైనా కోయంబేడు నుంచి ఆమ్నీ బస్సులు నడిపేందుకు అనుమతించాలని కోరుతూ తిరుచెందూరుకు చెందిన న్యాయవాది రామ్‌కుమార్ ఆదిత్తన్ ప్రజాహిత వాజ్యం దాఖలు చేశారు. ఈ వాజ్యం ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి మహాదేవన్, న్యాయమూర్తి మహమ్మద్ సఫీక్‌తో కూడిన ధర్మాసనం ఎదుట మంగళవారం విచారణకు వచ్చింది. కిలాంబాక్కం నుండే ఆమ్నీ బస్సులు సహా అన్ని బస్సులు నడపాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన కేసులు సింగిల్ జడ్జి విచారణలో ఉన్నాయని, అలాంటప్పుడు ఈ ప్రజాహిత వాజ్యాన్ని ధర్మాసనం విచారణ జరుపటం సమంజసం కాదని ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్ వాదించారు. ఆ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం ప్రభుత్వ ఉత్తర్వును వ్యతిరేకిస్తూ సింగిల్ జడ్జి సమక్షంలో పలు పిటిషన్ల విచారణ పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో కోయంబేడు నుంచి ఆమ్నీ బస్సులను నడిపేందుకు తాము అనుమతి జారీ చేసే ప్రసక్తేలేదని, పిటిషనర్ సింగిల్ జడ్జి ఎదుట పిటిషన్‌ను దాఖలు చేసుకోవాలని ఆదేశించింది.

వాణిజ్య పన్నుల శాఖకు రూ.3,727 కోట్ల అదనపు ఆదాయం

● మంత్రి మూర్తి

పెరంబూర్, జూలై 9: వాణిజ్య పన్నుల శాఖకు 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్, మే, జూన్)లో రూ.3,727 కోట్ల అదనపు ఆదాయం సమకూరిందని ఆ శాఖ మంత్రి మూర్తి తెలిపారు. ఈ మేరకు మంగళవారం మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... వాణజ్య పన్నుల శాఖ తనిఖీల్లో రూ1,040 కోట్ల ఇన్‌పుట్ టాక్స్ గుర్తించి చర్యలు చేపట్టామన్నారు. నకిలీ బిల్లులు జారీచేసిన 316 రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ల రద్దుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

లండన్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూలై 9: 'నాన్ మొదల్‌వన్', బ్రిటీష్ కౌన్సిల్ సంయుక్తంగా చేపట్టిన స్కాట్ (స్కాలర్స్ ఫర్ ఔట్ స్టాండింగ్ అండర్ గ్రాడ్యుయేట్ టాలెంట్ ఇన్ తమిళనాడు) పథకం కింద రాష్ట్రానికి చెందిన 24 మంది విద్యార్థులు గత నెల 9 నుంచి 16 వరకు ఇంగ్లాండ్‌లోని డర్హమ్ వర్సిటీలో సైన్స్‌పై శిక్షణ పొందారు. వీరిలో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులున్నారు. వారు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుబ్బులక్ష్మి కలుసుకుని సర్టిఫికెట్లు చూపారు. వారిని ఆశీర్వదించిన కలెక్టర్, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

తిరుచ్చి ఎన్‌ఐటీలో చేరిన తొలి గిరిజన విద్యార్థిని



విద్యార్థిని రోహిణి

పెరంబూర్, జూలై 9: తిరుచ్చి జిల్లా తురైయూర్‌కు చెందిన గిరిజన విద్యార్థిని జేఈఈ పరీక్షల్లో విజయం సాధించి తిరుచ్చి ఎన్‌ఐటీలో సీటు సంపాదించింది. తురైయూర్ సమీపం పచ్చమలై ప్రాంతానికి చెందిన గిరిజన విద్యార్థిని రోహిణి, జేఈఈలో 73.8 శాతం మార్కులు సాధించి రాష్ట్రం నుంచి పరీక్ష రాసిన గిరిజన విద్యార్థుల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పరీక్షలో మంచి మార్కులు సాధించిన రోహిణి, తిరుచ్చి ఎన్‌ఐటీలో కెమికల్ ఇంజనీరింగ్ కోర్సు ఎంపిక చేసుకుంది. 60 ఏళ్ల చరిత్ర కలిగిన తిరుచ్చి ఎన్‌ఐటీ కళాశాలలో చేరిన తొలి గిరిజన విద్యార్థిని అన్న గౌరవం రోహిణి దక్కించుకుంది. ఆమెతో పాటు జేఈఈ పరీక్షలో ఉత్తీర్ణులైన సుకన్య అనే గిరిజన విద్యార్థిని తిరుచ్చి ఎన్‌ఐటీ కళాశాలలో చేరింది. ఎన్‌ఐటీ కెమికల్ విభాగాన్ని చూసేందుకు వెళ్లిన సమయంలో ఏర్పడిన ఆసక్తి జేఈఈ పరీక్షలో విజయం సాధించేందుకు దోహదపడిందని రోహిణి తెలిపారు.

5 నుంచి పినాకిని, జనశతాబ్ది రైళ్ల రద్దు

పెరంబూర్, జూలై 9: విజయవాడ యార్డ్ పరిధిలో మరమ్మతుల కారణంగా పినాకిని, జనశతాబ్ధి రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● నెం.12711 విజయవాడ- చెన్నై సెంట్రల్, నెం.12712 చెన్నై సెంట్రల్-విజయవాడ పినాకినీ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 5 నుంచి 10వ తేది వరకు పూర్తిగా రద్దు. ● నెం.12077 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-విజయవాడ, నెం.12078 విజయవాడ-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 5 నుంచి 10వ తేది వరకు పూర్తిగా రద్దు.

- నెం.17237 బిట్రగుంట- చెన్నై సెంట్రల్, నెం.17238 చెన్నై సెంట్రల్-బిట్రగుంట ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 4 నుంచి 11వ తేది వరకు పూర్తిగా రద్దు.

పాక్షిక రద్దు...

- నెం.12760 హైదరాబాద్ నుంచి సాయంత్రం 6 గంటలకు తాంబరం వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 2 నుంచి 10వ తేది వరకు వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడకు బదులుగా పగిడిపల్లి, గుంటూరు, తెనాలి మీదుగా మళ్లింపు. ఈ రైలుకు నల్గొండ, గుంటూరులో అదనపు హాల్ట్.
- నెం.12759 తాంబరం నుంచి సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ వెళ్లే రైలు ఆగస్టు 2 నుంచి 10వ తేది వరకు విజయవాడ, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్ వరంగల్, ఖాజీపేటకు బదులుగా తెనాలి, గుంటూరు, పడిగిపల్లి మీదుగా మళ్లింపు. ఈ రైలుకు గుంటూరు, నల్గొండలో అదనపు హాల్ట్.

17న శశికళ పర్యటన

ఐసిఎఫ్, జూలై 9: ఈ నెల 17 నుంచి తెన్‌కాశిలో శశికళ పర్యటించనున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకేను సమన్వయపరచి 2026లో అధికారాన్ని చేజిక్కించుకొనేలా శ్రమించనున్నట్లు శశికళ ఇటీవల ప్రకటించారు. ఈ విషయమై శశికళ మద్దతుదారులు మాట్లాడుతూ... ఈ నెల 17వ తేది తెన్‌కాశిలో శశికళ పర్యటన ప్రారంభమవుతుందని, వివిధ జిల్లాలు సందర్శించినప్పుడు అన్నాడీఎంకేలో మార్పులు జరుగుతాయని తెలిపారు.

రూ.100 కోట్ల విలువైన స్థలం స్వాధీనం

ఐసిఎఫ్, జూలై 9: ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న ప్రైవేటు కళాశాల భవనాన్ని కూల్చివేసి అధికారులు సీలు వేశారు. సెయింట్ థామస్ మౌంట్ జీఎస్‌టీ రోడ్డు సమీపంలో మూడు ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఆ స్థలంలో ఓ ప్రైవేటు కళాశాల భవనం నిర్మించారు. సమాచారం అందుకున్న చెంగల్పట్టు జిల్లా అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకొని, భవనం కూల్చివేశారు. స్వాధీనం చేసుకున్న స్థలం విలువ రూ.100 కోట్లు ఉంటుందని తహసీల్దార్ ఆర్ముగం తెలిపారు.

వందేళ్ల తర్వాత తిరుముక్తీశ్వరాలయ కుంభాభిషేకం

● దేవాదాయ శాఖ వెల్లడి

అడయార్, జూలై 9: తిరుచ్చిలోని తిరుముక్తీశ్వరాలయానికి వందేళ్ల తర్వాత కుంభాభిషేకం జరుగనుంది. ఈ కుంభాభిషేక వేడుకలు ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తామని హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని పురాతన ఆలయాల్లో ఒకటైన తిరుముక్తీశ్వరాలయం జీర్ణోద్ధరణ పనులన్నీ ఇటీవలే ముగిశాయి. దీంతో ఈ ఆలయ కుంభాభిషేకం ఈ నెల 12న నిర్వహించాలని నిర్ణయించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు, ఆ శాఖ ముఖ్య ఉన్నతాధికారులు, ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొనున్నారు. ఇందుకోసం ఆలయ పూజారులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారి శివకుమార్

వేలూరు, జూలై 9:! స్థానిక సత్తువాచేరిలో ప్రైవేటు పాఠశాలలో కార్పొరేషన్ కమిషనర్ ఉత్తర్వులతో కార్పొరేషన్ ఆరోగ్య శాఖ అధికారి శివకుమార్ నేతృత్వంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. పర్యావరణ పరిరక్షణ, వర్షాకాలంలో సంభవించే వ్యాధులు, వ్యాధులు రాకుండా చేపట్టాల్సిన చర్యలపై శివకుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు, కార్పొరేషన్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 9: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

వేళచ్చేరి: టాన్సీ నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, ఎల్‌ఐసీ కాలని, టాన్సీ నగర్ 1 నుంచి 7 వీధులు, తరమణి లింక్ రోడ్డు, దండీశ్వరం 11,12 వీధులు

పోరూర్: లక్ష్మీ నగర్, పిల్లయార్ ఆలయ వీధి, న్యూ కాలని, అన్నాసాలై, మూర్తి అవెన్యూ, ట్రంక్ రోడ్డు, లక్ష్మీ నగర్ 40 అడుగుల రోడ్డు, భరణిపుత్తూర్, తెల్లియార్ అగరం, మధురం నగర్, ధనలక్ష్మి నగర్, పెరియకొళతువాంజేరి, తిరుముడివాక్కం, టెంపుల్ వ్యూ, తిరునీర్‌మలై మెయిన్ రోడ్డు, తిరువూరగ పెరుమాళ్ ఆలయ నగర్, పోలీస్ క్వార్టర్స్, శరణ్య నగర్, శర్మా నగర్

అడయార్: కొట్టివాక్కం, తిరువాన్మియూర్, కామరాజ్ నగర్ 3,4 మెయిన్ రోడ్లు, పీటీసీ డిపో, తిరువళ్లువర్ రోడ్డు 5 నుంచి 24 క్రాస్ వీధులు, కామరాజ్ నగర్, సౌత్ అవెన్యూ, మంగళేరి

మధురవాయల్: అకోలా అపార్ట్‌మెంట్స్, పూందమల్లి హైరోడ్డు, పిల్లయార్ ఆలయ వీధి, వరలక్ష్మి నగర్, అభిరామి నగర్, మిట్టనమల్లి, భారతి నగర్, మురుగన్ ఆలయ వీధి, మాతా ఆలయ వీధి, మోరై, వీరాపురం, అన్నానగర్, తిరుమలై నగర్, మౌంట్ బ్రిక్స్ వివేకానంద వీధి, సమయపురం ప్రధాన వీధి, సాయి నగర్, ఓంశక్తి నగర్, పోరూర్ గార్డన్ ఫేస్-1,2, హెరిటేజ్ వివేకానంద వీధి, మేట్టుకుప్పం మెయిన్ రోడ్డు, అన్నా వీధి, ధర్మరాజ ఆలయ వీధి, కామధేను నగర్, పెరుమాళ్ ఆలయ వీధి, ఆండాళ్ నగర్, మెట్రో నగర్.

'ఫ్లిప్‌కార్ట్' పేరుతో విద్యార్థి వద్ద రూ.లక్ష స్వాహా

పెరంబూర్, జూలై 9: 'ఫ్లిప్‌కార్ట్'లో బహుమతి వచ్చిందని చెప్పి కళాశాల విద్యార్థి నుంచి రూ. లక్ష కాజేసిన వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. విల్లుపురం సమీపం నత్తమేడు గ్రామానికి చెందిన చంద్రు (20) కడలూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. చంద్రుకు కొద్దిరోజుల క్రితం ఫోన్ చేసిన ఓ వ్యక్తి, ఫ్లిప్‌కార్ట్ బహుమతుల డ్రాలో రూ.12.50 లక్షలు గెలుచుకున్నారని, బహుమతి పొందేందుకు ఆధార్ కార్డు, వివరాలు పంపాలని కోరాడు. ఈ మాటలు నమ్మిన చంద్రు, తన ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు ఆ వ్యక్తి చెప్పి వాట్సాప్ నెంబరుకు పంపాడు. అనంతరం చంద్రు సంప్రదించిన సదరు వ్యక్తి, రూ.12.50 లక్షలు పొందాలంటే డెలివరీ చార్జీ, జీఎస్‌టీ తదితరాలకు నగదు పంపించాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో, చంద్రు తన బ్యాంక్ ఖాతా నుంచి ఐదు విడతలుగా రూ.1,00,800లు గూగుల్ పే ద్వారా పంపించాడు. రోజులు గడిచినా అతని నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో అనుమానించిన చంద్రు మోసపోయినట్లు తెలుసుకొని విల్లుపురం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు, నూతన పద్ధతిలో నగదు కాజేసిన వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

అడవి దున్న దాడిలో రైతు మృతి

పెరంబూర్, జూలై 9: కోయంబత్తూర్ జిల్లా వాల్పాడి సమీపంలో అడవి దున్న దాడిలో రైతు మృతిచెందాడు. సడయంపట్టి గ్రామానికి చెందిన రైతు గణేశన్ మంగళవారం తన పొలంలోకి వెళ్లిన సమయంలో అక్కడ సంచరిస్తున్న అడవిదున్నను గమనించాడు. పొలం నుంచి దానిని తరిమేందుకు యత్నించిన సమయంలో, అది గణేశన్‌పై దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యారు. చుట్టుపక్కల వారు వెళ్లి అడవిదున్నను తరిమి, గణేశన్‌ను సమీపంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నకిలీ ఐఏఎస్ అధికారి కోసం గాలింపు

ప్యారీస్, జూలై 9: తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్‌ఈబీ) ఉన్నతాధికారినంటూ బెదిరించిన వ్యక్తి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. టీఎన్‌ఈబీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి రాజేష్ లఖాని వ్యవహరిస్తున్నారు. ఆయన వాట్సాప్ నెంబరుకు వచ్చిన సమాచారంలో "హాయ్...ఐ యామ్ రాజేష్ లఖాని అని ఫోటో సహా ఉంది". తన సెల్‌ఫోన్ నెంబరుకు తన ఫొటో, పేరుతోనే సమాచారం పంపించడంతో ఆయన దిగ్భ్రాంతికి గురయ్యారు. దీనిపై ట్రిప్లికేన్ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు.

ఆడిటర్ ఇంట్లో బంగారం చోరీ

● ముగ్గురి అరెస్టు

అడయార్, జూలై 9: ఈరోడ్‌లో ఒక ఆడిటర్ ఇంటిలో 235 సవర్ల బంగారం చోరీకి గురైంది. ఈ ఘటనపై స్పందించిన పోలీసులు చోరీకి పాల్పడిన వారిలో ముగ్గురు దొంగలను అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... ఈరోడ్, సూరాపట్టి ఎన్జీజీవో కాలనీ ఏజీ వీధికి చెందిన సుబ్రమణి అనే ఆడిటర్, ఆయన సతీమణి సాధన కలిసి తేనిలో జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన ఇంటి దొంగలు 235 సవర్ల నగలు, రూ.48 లక్షలు చోరీ చేశారు. ఈ దంపతులిద్దరూ తేని నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఇంట్లో జరిగిన చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు తక్షణం స్పందించి చోరీకి పాల్పడిన వారిలో ముగ్గురు దొంగలను పట్టుకున్నారు. ఈ చోరీకి ఆడిటర్ అసిస్టెంట్ విఘ్నేష్, కారు డ్రైవర్ సత్యన్‌లు సహకరించినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో వీరితో పాటు చోరీలో కీలక భూమిక పోషించిన అరుణ్ కుమార్‌ను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరికొందరు దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

బంగారం స్మగ్లింగ్‌కు సహకరించిన కస్టమ్స్ అధికారి సస్పెన్షన్

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మీనంబాక్కంలోని అంతర్జాతీయ విమానాశ్రయ టెర్మినల్‌లో విదేశాల నుంచి బంగారాన్ని అక్రమంగా తరలించే స్మగ్లర్లకు సాయం చేశారనే ఆరోపణపై కస్టమ్స్ అధికారి శరణన్‌ను సస్పెండ్ చేశారు. ఇంటర్నేషనల్ టెర్మినల్ కస్టమ్స్ కార్యాలయంలో పనిచేస్తున్న శరవణన్ విదేశాలకు వెళ్లే ప్రయాణికులతో పరిచయాలు పెంచుకుని, తిరిగొచ్చేటప్పుడు వారు తెచ్చే బంగారాన్ని దాచి సాయపడేవాడని ఇటీవల కస్టమ్స్ ఉన్నతాధికారులు జరిపిన విచారణలో వెల్లడైంది. దీంతో మంగళవారం ఉదయం ఆయనను సస్పెండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో టీ మాస్టర్ మృతి

ప్యారీస్, జూలై 9: స్థానిక కోయంబేడు ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో అన్నానగర్‌లో టీ మాస్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుమరవేల్ (46) అన్నానగర్‌లో ఉన్న ఓ టీ దుకాణంలో పనిచేశారు. ఆయన రోజులాగే తన ద్విచక్రవాహనంలో వెళ్తున్న సమయంలో కోయంబేడు జంక్షన్‌లో గుర్తుతెలియని వాహనం ఆయన వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన కుమరవేల్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కోయంబేడు ట్రాఫిక్ విభాగం పోలీసులు మృతదేహన్ని కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

చెరుకుతోటను ధ్వంసం చేసిన అడవి ఏనుగులు



చెరకు గడలు తింటున్న ఏనుగులు

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా తాళవాడి సమీపం రామాపురం వద్ద మల్లు అనే రైతు కు చెందిన మూడెకరాల చెరకుతోటలో నాలుగు అడవి ఏనుగులు చొరబడి పంటను ధ్వంసం చేశాయి. సోమవారం ఉదయం రైతు మల్లు తోటకు వెళ్ళినప్పుడు నాలుగు ఏనుగులు చెరకుగడలు తింటుండం చూసి దిగ్భ్రాంతిచెందాడు. వెంటనే ఆ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అటవీశాఖ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని ఏనుగులను తరిమికొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. డ్రోన్ కెమెరాల సహాయంతో ఆ ఏనుగుల సంచార ప్రాంతాన్ని గుర్తించి మంగళవారం వేకువజామున ఆ ఏనుగులను అటవీ శాఖ సిబ్బంది అడవుల్లోకి తరిమివేశారు.

సుదీర్ఘ న్యాయపోరాటంతో సమరయోధుడికి పెన్షన్ బకాయిల చెల్లింపు

● ప్రభుత్వ అధికారికి తప్పిన కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన

చెన్నై, జూలై9 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘన్యాయపోరాటం తర్వాత 97 యేళ్ల వయసున్న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పెన్షన్ బకాయిలు అందుకున్నాడు. అదే సమయంలో ఈ కేసు విచారణకు హాజరుకాని రాజకీయ పింఛన్ల విభాగం ప్రభుత్వ కార్యదర్శి కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన శిక్ష నుంచి తప్పించుకున్నారు. సుభాష్ చంద్రబోస్ నెలకొల్పిన సైన్యంలో సభ్యుడి సేవలందించిన వేలు (97)కు 2008 నుంచి 2021 వరకు పెన్షన్ అందలేదు. ఈ విషయమై ఆయన మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తి అనితా సుమంత్ ఈ పిటిషన్‌పై విచారణ జరిపి పెన్షన్ బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోని, విచారణకు కూడా హాజరుకాని ప్రభుత్వ రాజకీయ పింఛన్ల విభాగం ప్రధాన కార్యదర్శిపై కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కింద చర్యలు చేపడతామని హెచ్చరించారు. దీంతో సోమవారం జరిగిన ఈ కేసు విచారణకు హాజరైన సదరు అధికారి ఒకట్రెండు రోజుల్లో పింఛన్ బకాయిలు పిటిషనర్ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. అయితే న్యాయమూర్తి అప్పటికప్పుడే పింఛన్ బకాయిలు చెల్లించాలని ఆదేశించడంతో గంట తర్వాత పింఛన్ బకాయిలు సమరయోధుడి ఖాతాలో జమ అయ్యాయి. దీంతో వేలు హైకోర్టు న్యాయమూర్తికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

నగరంలో మళ్లీ 'రూట్ తల' వ్యవహారం

● పచ్చయప్పన్ కళాశాల విద్యార్థుల ఆగడాలు

ప్యారీస్, జూలై 9: రాజధాని నగరంలో మళ్లీ 'రూట్ తల' వ్యవహారం వివాదాస్పదమైంది. నగరంలో ఏదో ఒక ప్రాంతంలో ఎంటీసీ బస్సు ఎక్కే విద్యార్థుల్లో ఒకరు తాను లీడర్ కావాలని సహ విద్యార్థులతో కలసి అల్లర్లకు పాల్పడడం రూట్ తలగా చెబుతున్నారు. గ్రేటర్ చెన్నై పోలీసుల చర్యల కారణంగా కొన్ని నెలలుగా సద్దుమణిగిన రూట్ తల వ్యవహారం మళ్లీ వెలుగుచూసింది. అమింజికరై ప్రాంతంలోని పచ్చయప్పన్ కళాశాల విద్యార్థులు కొందరు ఈ నెల 5వ తేది ఎంటీసీ బస్సు టాపుపై కూర్చొని అట్టహాసం చేసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. పోలీసుల కళ్లెదుటే బ్రాడ్-పూందమల్లి హైరోడ్డులో కళాశాల సమీపంలో టపాసులు కాల్చడం, నడిరోడ్డులో కేరింతలు కొడుతూ చిందులేయడం, రాస్తారోకోలో పాల్గొనడం వంటి చర్యలతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇలాంటి విద్యార్థుల ఆగడాలు అదుపుచేసేలా పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

జీవితాన్ని ప్రతి క్షణం ఆస్వాదించాలి

● రాఘవ్ మిర్దార్థ్


'బన్ బట్టర్ జామ్' చిత్ర బృందం

జీవితంలో చాలా మందికి పాత జ్ఞాపకాలుంటాయనీ, ప్రతి ఒక్కరూ భూత, భవిష్యత్, వర్తమానాలను మరిచి ప్రతి క్షణం ఆస్వాదించడాన్ని అలవర్చుకోవాలన్న కాన్సెప్టుతో తెరకెక్కించిన చిత్రమే 'బన్ బట్టర్ జామ్' అని ఈ సినిమా దర్శకుడు రాఘవ్ మిర్దార్థ్ తెలిపారు. బిగ్ బాస్ ఫేం రాజు, ఆద్య ప్రసాద్, భవ్య జంటగా నటించిన ఈ చిత్రం ఫస్ట్‌లుక్ సోమవారం నగరంలో విడుదల చేశారు. ఇందులో దర్శకుడు మాట్లాడుతూ, 'గత జ్ఞాపకాలు, భవిష్యత్ గురించి ఆందోళన చెందకుండా, ప్రతి క్షణం ఎలా ఆనందంగా గడపాలో ఈ సినిమాలో చెప్పడం జరిగింది. ఇదే అంశం ఫస్ట్‌లుక్‌లో ప్రతిబింబించేలా డిజైన్ చేశాం. ఈ సినిమా స్క్రిప్టుకు ఒక ఫుడ్ ఐటెం కావాల్సి రాగా, బన్ బట్టర్ జాం ఎంచుకున్నాం. ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుంచి ఒక ఆహారాన్ని అమితంగా ఇష్టపడుతూ దాన్ని గుర్తుపెట్టుకుంటారు. ఆ పదార్థాన్ని చాలాకాలం తర్వాత చూస్తే పాత జ్ఞాపకాలు ఒక్కసారిగా గుర్తుకు వస్తాయి. ఈ సినిమాలో ఐడియాని సింపుల్‌గా చెప్పేందుకు ఈ ఫుడ్‌ను ఎంచుకున్నాం. ఈ సినిమా చిత్రీకరణ పనులు తుది దశకు చేరుకున్నాయి' అని పేర్కొన్నారు. హీరో రాజు మాట్లాడుతూ, 'బిగ్ బాస్' హౌస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత సినిమా హీరో కావాలన్న ఆశ నాకు లేదు. ఎందుకంటే అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఇండస్ట్రీలో ఉన్న పరిస్థితి తెలుసు. సినిమాకు కథే హీరో. మంచి స్టోరీని ప్రేక్షకులు ఆదరిస్తారు. ఎస్‌జే సూర్య కోసం ఒక కథ రాయగా, అందులో నన్నే నటించాలని సలహా ఇచ్చారు. అలా కొంతకాలం గడిచిన తర్వాత ఇపుడు ఈ సినిమాలో అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉంది. నాకు దర్శకత్వం వహించే అవకాశం వచ్చినప్పటికీ అటువైపు వెళ్ళలేదు. ఈ స్థాయికి చేరుకోవడానికి కారణమైన విజయ్ టీవీకి, బిగ్ బాస్ హౌస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. హీరోయిన్లు ఆద్య, భవ్య, సంగీత దర్శకుడు నివాస్ కె.ప్రసన్న తదితరులు ప్రసంగించారు. కాగా ఈ చిత్రాన్ని రెయిన్ ఆఫ్ ఆరోస్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మించారు.

అభిమానుల రక్తదానం హీరో కార్తీ అభినందన

చిత్రజ్యోతి


అభిమానులతో హీరో కార్తీ

కోలీవుడ్ కథానాయకుడు కార్తీ సమాజానికి ఏదో ఒక రూపంలో తన వంతు సాయం చేస్తుంటారు. ఇందులో ఆయన అభిమానులు కూడా చేదోడువాదోడుగా ఉంటున్నారు. ఈ క్రమంలో మే 25వ తేదీ హీరో కార్తీ తన 47వ పుట్టిన రోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. తన అభిమానుల సేవలను గుర్తించిన హీరో కార్తీ వారిని స్వయంగా కలుసుకుని అభినందిస్తున్నారు. ఇందులోభాగంగా, తొలుత ఉత్తర చెన్నై, దక్షిణ చెన్నై, సెంట్రల్ చెన్నైతో పాటు కళ్ళకుర్చి, తిరువారూర్, తిరువళ్ళూరు జిల్లాలకు చెందిన అభిమానులతో ఆయన సమావేశమయ్యారు. వారికి రుచికరమైన విందు భోజనం స్వయంగా వడ్డించారు. ఆ తర్వాత ప్రతి ఒక్కరితో ఫొటోలు దిగారు. స్థానిక త్యాగరాయ నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన అభిమానులకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కార్తీ మాట్లాడుతూ, 'నా పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ పేరుపేరునా అభినందిస్తున్నాను. బర్త్‌డే రోజున అనారోగ్యంతో ఉండటంతో స్వయంగా కలుసుకోలేకపోయాను. నేను ఒక వైద్యుల గ్రూపులో ఉన్నాను. వారి మధ్య జరిగే సంభాషణల్లో రక్తం కొరత అధికంగా ఉన్నట్టు వెల్లడించారు. అందుకే రక్తదానం చేసి, ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని కోరుతున్నానన్నారు.


కేబీకి విగ్రహం ఏర్పాటు చేయాలి దర్శకుడు భారతీరాజా

దిగ్గజ దర్శకుడు దివంగత కె.బాలచందర్ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని సినీ దర్శకుడు భారతీరాజా కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు విజ్ఞప్తి చేశారు. కె.బాలచందర్ 94వ జయంతి వేడుకలు నగరంలో మంగళవారం కె.బాలచందర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఆళ్వార్‌పేట సీతమ్మాళ్ కాలనీలో ఉన్న రాజ్ కమల్ ఫిల్మ్ కార్యాలయంలో జరిగాయి. ఈ వేడుకలను సీనియర్ దర్శకుడు భారతీరాజా, మైలాపూర్ ఎమ్మెల్యే టి.వేలు, నడిగర్ సంఘం ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీరాజా మాట్లాడుతూ, ఆళ్వార్‌పేటలో ఉన్న కావేరీ ఆస్పత్రి సమీపంలో వెయ్యి అడుగుల విస్తీర్ణంలో కేబీ స్క్వేర్ ఏర్పాటు చేసి, అక్కడ బాలచందర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. మరోవైపు తన గురువు కె.బాలచందర్ జయంతిని పురస్కరించుకుని విశ్వనటుడు కమల్ హాసన్ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. జీవితంలో నిబద్ధతో ఎలా ముందుకు వెళ్ళాలో నేర్పించిన వ్యక్తి బాలచందర్ అని అన్నారు. థ్యాంక్యూ కేబీ సర్ అంటూ అందులో పేర్కొన్నారు.


కె.బాలచందర్‌కు భారతీరాజా తదితరుల నివాళులు

నేడు 'తంగలాన్' ట్రైలర్ రిలీజ్

పా.రంజిత్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్ హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్' ట్రైలర్ బుధవారం విడుదల చేయనున్నారు. నీలం ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ బ్యానరుపై బడా నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మాళవిక మోహనన్, పార్వతి హీరోయిన్లుగా నటించగా, పశుపతి, హరికృష్ణన్, అన్బుదురైలో ముఖ్య పాత్రలు పోషించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రాన్ని త్వరలో ప్రపంచ వ్యాప్తంగా తమిళం, తెలుగు, కన్నడం, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 10వ తేదీ విడుదల చేయనున్నట్టు మూవీ మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. ఈ సినిమా కోసం హీరో విక్రమ్ మారినతీరు ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. దీంతో ఈ సినిమా ట్రైలర్‌పై కూడా భారీగా అంచనాలు నెలకొన్నాయి.


'తంగలాన్'లో విక్రమ్

తిరుచెందూర్ మురుగన్‌కు కాసుల పేరు


స్వామివారికి సమర్పించిన బంగారు కాసులపేరు

ఐసిఎఫ్, జూలై 9: తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామికి ఓ భక్తుడు బంగారు కాసులపేరు కానుకగా సమర్పించారు. ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారి దర్శనానంతరం నగదు, వస్తువులు కానుకలుగా సమర్పిస్తుంటారు. ఆ ప్రకారం, సోమవారం రామనాధపురం జిల్లా పెరునాళి ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్ బోస్ ఆలయానికి వచ్చి స్వామివారికి పూజలు నిర్వహించి, కానుకగా 978 గ్రాముల బరువున్న బంగారు కాసులపేరును సమర్పించారు.

రెండు లక్షల మందితో 'పుదుకోట చదువుతోంది'


విద్యార్థులు, ఉద్యోగులతో కలసి పుస్తక పఠనంలో కలెక్టర్ మెర్సీ రమ్య

పెరంబూర్, జూలై 9: 'పుదుకోట వాసిక్కిరదు (పుదుకోట చదువుతోంది)' కార్యక్రమంలో రెండు లక్షల మంది పాల్గొన్నారు. పుదుకోటలో ఈ నెల 27 నుంచి ఆగస్టు 5వ తేది వరకు నిర్వహించనున్న 'పుదుకోట బుక్ ఎగ్జిబిషన్'పై అవగాహన కల్పించేలా, 2 లక్షల మంది విద్యార్థినీ, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, పుస్తక ప్రియులు పాల్గొన్న 'పుదుకోట చదువుతోంది' కార్యక్రమం మంగళవారం జరిగింది. పుదుకోట అన్నార్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఐఎస్ మెర్సీ రమ్య పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, గ్రంథాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో చేరిన విద్యార్థులు, ఉద్యోగులు మొత్తం 2 లక్షల మంది ఉదయం 10 నుంచి 11 గంటల వరకు తమకిష్టమైన పుస్తకాలు పఠించారు.

మరవమంగళం ప్రాథమిక పాఠశాలలో రైలు బోగీల ఆకారంలో తరగతి గదులు




చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా మరవమంగళం గ్రామంలోని పంచాయతీ ప్రాథమిక పాఠశాల కొత్త రూపు సంతరించుకుంది. ఇటీవల ఆ పాఠశాలకు రూ.10.67లక్షలతో మరమ్మతులు చేపట్టారు. ప్రతి తరగతి గదిని రైలు బోగీలా పెయింటింగ్ చేశారు. తరగతి గదుల్లో సామెతలు, తిరుక్కురళ్ సూక్తులు, సిద్ధవైద్య చిట్కాలు కూడా రాయించారు. ఇలా కొత్త అందాలు సంతరించుకున్న ఆ పాఠశాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

నదులు, కాలువల్లో డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారీ

పెరంబూర్, జూలై 9: స్థానిక ఒట్టేరి కూవం నది, కాలువల్లో డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారి పనులను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రారంభించింది. జీసీసీ పరిధిలో దోమల బెడద సమస్యగా మారింది. ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో దోమల బెడద సహజంగానే అదుపులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో మే 30 నుంచి నైరుతి రుతుపవన వర్షాలు ప్రారంభయ్యాయి. నగరంలో సాయంత్రం, రాత్రి వేళల్లో భారీవర్షం కురుస్తోంది. దీంతో, నగరంలోని కూవం నది, కాలువల్లో దోమల బెడద అధికమైంది. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ... వర్షాలు కురిస్తే దోమల బెడద కూడా అధికమవుతుందన్నారు. వర్షాలకు ముందే ప్రతి ఇల్లు, ఖాళీ ప్రదేశాలు పరిశీలించి, దోమల ఉత్పత్తికి ఆధారంగా ఉండే టెంకాయల వ్యర్థాలు, వినియోగించని టైర్లు తదితరాలు తొలగించామన్నారు. అలాగే, అన్ని వీధులు, ఇళ్లలో దోమల మందు పిచికారీ చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం కూవం, అడయార్ నదులు, బకింగ్ హామ్ కాలువ, 30కి పైగా కాలువల్లో 6 డ్రోన్ల ద్వారా దోమల నిర్మూలన చర్యల్లో భాగంగా మందు పిచికారీ చేసే పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.


అడయార్ నది సమీపంలో డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారి

ఆమ్‌స్ట్రాంగ్ సతీమణికి స్టాలిన్ పరామర్శ


బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ సతీమణి పొర్కొడికి ధైర్యం చెబుతున్న సీఎం స్టాలిన్

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దారుణహత్యకు గురైన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పరామర్శించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ నెల ఐదోతేదీ రాత్రి పెరంబూరు వద్ద తన పాతింటి స్థలంలో భవననిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆమ్‌స్ట్రాంగ్‌పై ఆరుగురు దుండగులు వేటకొడవళ్లతో దాడి జరిపి దారుణంగా హతమార్చారు. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఉత్తర ప్రదేశ్ నుండి బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి వచ్చి ఆమ్‌స్ట్రాంగ్ భౌతికకాయానికి నివాళుర్పించారు. ఆ తర్వాత రాష్ట్రానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నేతలందరూ దివంగత నేతలకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అయనవరంలో ఉన్న ఆమ్‌స్ట్రాంగ్ నివాసానికి వెళ్లి ఆయన సతీమణి పొర్కొడిని, ఇతర కుటుంబ సభ్యులను, బంధువులను పరామర్శించారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో నిందితులెవరినీ విడిచిపెట్టే ప్రసక్తేలేదని, అందరినీ అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటానని పొర్కొడికి ఆయన భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రితోపాటు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు కూడా ఆమ్‌స్ట్రాంగ్ కుటుంబీకులను ఓదార్చారు.

అణగారిన వర్గాలపై పెరిగిన దాడులు

● కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఆరోపణ


మాట్లాడుతున్న కేంద్రమంత్రి మురుగన్

పెరంబూర్, జూలై 9: రాష్ట్రంలో అణగారిన వర్గాలపై దాడులు రెండు రెట్లు పెరిగాయని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఆరోపించారు. ఢిల్లీలో మంగళవారం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో అంటరానితనం అధికంగా ఉందన్నారు. ఆ కారణంగా 22 పంచాయతి గ్రామాల అధ్యక్షులు తమ విధులు నిర్వహించలేని పరిస్థితులున్నాయన్నారు. వెంగైవాయల్ ఘటనకు సంబంధించి ఇంకా నేరస్తులను గుర్తించి అరెస్ట్‌చేయకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో అణగారిన వర్గాలపై దాడులు రెండు రెట్లు పెరిగాయని, శాంతి భద్రతలను అదుపు చేయడంలో డీఎంకే ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కళ్లకుర్చిలో కల్తీ సారా తాగి మృతిచెందినవారిలో 40 శాతం అణగారిన వర్గాల వారున్నారన్నారు. హత్రాస్ ప్రాంతంలో రద్దీలో చిక్కుకొని, మృతిచెందిన వారిని పరామర్శించిన కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ, కళ్లకుర్చి ఘటనలో మృతుల కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర బీజేపీ నేతలతో కూడిన బృందం జాతీయ ఎస్సీ కమిషన్ అధ్యక్షుడని కలుసుకొని, తమిళనాడులో దళిత వర్గాలపై జరుగుతున్న అమానుషదాడులపై ఫిర్యాదు చేయనున్నట్లు కేంద్ర మంత్రి మురుగన్ తెలిపారు.

బహుళజాతి సంస్థలకు ప్రోత్సాహం

● రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా

ప్యారీస్, జూలై 9: దేశంలోనే బహుళజాతి సంస్థలు భారీ పెట్టుబడులతో పరిశ్రమలు పెట్టేందుకు రాష్ట్రానికి వస్తున్నాయని, ఈ సంస్థలను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా పేర్కొన్నారు. తంజావూరు కొత్త బస్టాండ్ సమీపంలోని మేలవస్తాచావిడిలో రూ.30.50 కోట్లతో నిర్మిస్తున్న టైడల్ లియో ఐటీ పార్క్ పనులు దాదాపు 95 శాతం పూర్తయ్యాయి. మంగళవారం పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్‌తో కలసి మంత్రి రాజా ఆ పార్క్‌ను పరిశీలించారు. వారికి పూర్తిచేసిన పనుల వివరాలకు కలెక్టర్ దీపక్‌జాకబ్ తెలియజేశారు. అనంతరం మంత్రి రాజా మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు అధికస్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా పలు పారిశ్రామిక సంస్థలను ప్రారంభించినట్లు తెలిపారు. తంజావూరు జిల్లాలో కొత్తగా పారిశ్రామికవాడను త్వరలోనే ప్రారంభించనున్నామని, ప్రస్తుతం పనులు పూర్తయిన ఐటీ పార్క్ వల్ల జిల్లాలో అనేక మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. చెంగిపట్టి ప్రాంతంలో ఉన్న క్షయ ఆసుపత్రిని తొలగించనున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న కథనాల్లో వాస్తవం లేదన్నారు.

సీఎం రంగస్వామితో పుదువై వర్సిటీ వీసీ భేటీ

● అభివృద్ధి పనుల పురోగతిపై వివరణ


పుదువై సీఎం రంగస్వామిని కలిసిన పుదుచ్చేరి వీసీ తరణిక్కరసు తదితరులు

పుదుచ్చేరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామితో పుదుచ్చేరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.తరణిక్కరసు మంగళవారం సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి ఛాంబర్‌లో సీఎంను వీసీ, ఇతర అధికారులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో జరుగుతున్న వివిధ రకాలైన అభివృద్ధి పనుల పురోగతిని సీఎంకు వీసీ వివరించారు. ప్రధానంగా నాణ్యమైన విద్యా ప్రమాణాలను పాటిస్తూ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం యూనివర్సిటీ చేపట్టిన చర్యలను ఈ సందర్భంగా సీఎంకు ఆయన వివరించారు. అలాగే, యూనివర్సిటీలో నైపుణ్యాభివృద్ధి శిక్షణా కోర్సులను ప్రవేశపెట్టి ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు పరిశ్రమల అవసరాలు, విద్యాపరంగా ఉన్న అంతరాయాన్ని తగ్గించడం వంటి అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఐఐఆర్‌ఎఫ్)లో పుదుచ్చేరి వర్సిటీ ఎనిమిదో ర్యాంకు సాధించిన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్ళారు. అలాగే, వర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో మౌలికసదుపాయాల కల్పనకు ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పనితీరును సీఎం అభినందించిన సీఎం రంగస్వామి, యూనివర్సిటీ అభివృద్ధికి అన్ని రకాల సహాయక సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా ఎస్కేపీడీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కోత్తగిరి శాంతి ఆశ్రమంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్యారీస్, జూలై 9: స్థానిక జార్జిటౌన్ గోవిందప్పనాయకర్ వీధిలోని ఎస్కేపీడీ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ పాఠశాలలో 1970వ సంవత్సరం తెలుగు మీడియంలో చదువుకున్న దాదాపు 34 మంది విద్యార్థులు నీలగిరి, కోయంబత్తూర్ జిల్లాలకు మూడు రోజుల పర్యటనకు వెళ్లారు. వేసవి విడిది ప్రాంతమైన నీలగిరి జిల్లా కొత్తగిరిలోని శాంతి ఆశ్రమంలో బసచేశారు. 8 మంది పూర్వ విద్యార్థులు సతీమణులతో పాల్గొన్నారు. వీరు రమ్యమైన ప్రకృతి అందాల మధ్య ఆహ్లాద వాతావరణంలో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. 54 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం, సాయంత్రం యోగాసనాలు వేసి, సత్సంగం నిర్వహించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం కోతగిరి నుంచి కొండ రైలులో ఊటీ చేరుకొని బొటానికల్ గార్డన్, రోజ్ గార్డెన్ సందర్శించారు. పర్యటన ముగించుకొని మంగళవారం నగరానికి తిరిగొచ్చిన సందర్భంగా ఎస్కేపీడీ ధర్మ సంస్థ పాలక మండలి పూర్వ సభ్యులు ఊరా ఆంజనేయులు మాట్లాడుతూ... ఎస్కేపీడీ పాఠశాలలో 54 ఏళ్ల కిత్రం కలసి చదువుకున్న విద్యార్థులతో కలసి ఆధ్యాత్మిక విహారయాత్ర చేపట్టడం మరువరాని అనుభూతిని కలిగించిందన్నారు. ఎస్కేపీడీ కార్యదర్శి కె.రవీంద్రనాథ్ ఆధ్యాత్మిక విహార యాత్రకు సారధ్యం వహించారని తెలిపారు.

ఆ హీరోలపై చర్యలు తీసుకోవాలి

నిర్మాతల మండలి తీర్మానం

అడయార్, జూలై 9: కోలీవుడ్‌కు చెందిన పలువురు హీరోలపై నిర్మాతలు చేసిన ఫిర్యాదులు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని తమిళ చలన చిత్ర నిర్మాతల మండలి తీర్మానించింది. ఈ మండలి సమావేశం అధ్యక్షుడు ఎన్.మురళి అధ్యక్షత సోమవారం నగరంలో జరిగింది. ఇందులో మండలి కార్యదర్శులు ఆర్.రాధాకృష్ణన్, ఎస్.కదిరేశన్, ఉపాధ్యక్షుడు జీఎం తమిళ్‌కుమరన్, సహాయ కార్యదర్శి సౌందర్ రాజన్, కోశాధికారి చంద్రప్రకాష్ జైన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ముఖ్యంగా, తమిళనాడు చలనచిత్ర నిర్మాతల మండలి, ఫెఫ్సీ మధ్య కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయాలని తీర్మానించారు. మండలి సిఫార్సు లేఖలు పొందిన షూటింగులకు మాత్రమే ఫెఫ్సీ కార్మికులు సహకారం అందించాలన్నారు. ముఖ్యంగా తమిళ చిత్రపరిశ్రమకు చెందిన పలువురు హీరోలపై పలువురు నిర్మాతలు చేసిన ఫిర్యాదులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని నడిగర్ సంఘం దృష్టికి తీసుకెళ్ళి సంబంధిత హీరోలపై చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. కోలీవుడ్‌కు చెందిన అగ్రహీరోలు కమల్ హాసన్, ధనుష్, శింబు, విశాల్ వంటివారిపై పలువురు నిర్మాతలు లోగడ ఫిర్యాదులు చేసినట్టు సమాచారం.

ఖాళీ పోస్టుల భర్తీ కోసం విద్యుత్ ఉద్యోగుల ధర్నా

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బోర్డులో ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని, యేళ్ల తరబడి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆ సంస్థ ఉద్యోగులు మంగళవారం ఉదయం ధర్నా నిర్వహించారు. సిఐటీయూ ఆధ్వర్యంలో అన్నాసాలైలోని ప్రధాన కార్యాలయం ఎదుట ఈ ధర్నా జరిగింది. ధర్నా కారణంగా అన్నాసాలైలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇదే విధంగా రాష్ట్ర వ్యాపంగా 30 ప్రాంతాల్లో విద్యుత్ బోర్డు ఉద్యోగులు, కార్మికులు ఆందోళన జరిపారు.


అన్నాసాలైలోని విద్యుత్‌బోర్డు ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు



చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని యునెస్కో ఆధ్వర్యంలో దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ చిత్రలేఖనాల పోటీలో భారతదేశం తరపున పాల్గొని గెలుచుకున్న అవార్డును చూపుతున్న అప్సనా షర్మిన్ ఇషాక్


చెన్నై పెరంబూరులో దివంగత బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ నివాసగృహంలో కుటుంబీకులను పరామర్శించి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి